## భాషా సాహిత్యానికి రామరాజు కృషి ఎనలేనిది

### తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు నిత్యానందరావు

సారస్వత వ్యాసాల సంపుటిని ఆవిష్కరిస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 16: తెలుగు, సంస్కృత భాషా సాహిత్యం, జానపద సంపదకు ఆచార్య బిరుదురాజు రామరాజు చేసిన కృషి చిరస్మరణీయమని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు అన్నారు. సాహిత్య అకాడమీ, శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆచార్య బిరుదురాజు రామరాజు శతజయంతి సభ బుధవారం జరిగింది. భాషా నిలయం గౌరవ అధ్యక్షులు టి. ఉడయవర్లు అధ్యక్షతన జరిగిన సభలో బిరుదురాజు రామరాజు సారస్వత వ్యాసముల పుస్తకం, శతజయంతి స్మారక సంచికను వక్తలు ఆవిష్కరించారు. తెలుగు వర్సిటీ వీసీ వెల్దండ నిత్యానందరావు, సాహిత్య అకాడమీ సంచాలకులు సి. మృణాళిని, ప్రముఖ కవి అమ్మంగి వేణుగోపాల్ పాల్గొని రామరాజు సాహిత్య వ్యక్తిత్వాన్ని తమ ప్రసంగంలో ఆవిష్కరించారు. అనంతరం పాకనాటి జ్యోతి అధ్యక్షతన జరిగిన సదస్సులో రామరాజు సాహితీ యానంపై కంచి విజయలక్ష్మి, రామరాజు సాహిత్యోద్ధారణకు చేసిన కృషిపై సీహెచ్ లక్ష్మణచక్రవర్తి, జానపద వాఙ్మయోద్ధారణపై కె.పద్మావతి ప్రసంగించారు. తెలుగు వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో తెలుగు సాహిత్య వైతాళికులు రామారాజు అనే అంశంపై సంగిశెట్టి శ్రీనివాస్, ఆధ్యాత్మిక సాహిత్యంపై సాగి కమలాకరశర్మ, యక్షగాన పరిశోధనపై కాంచనపల్లి గోవర్ధన్‌రాజు ప్రసంగించారు. రచయిత్రి తిరునగరి దేవకీదేవి అధ్యక్షతన జరిగిన సదస్సులో వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి సూర్యధనుంజయ్, విమర్శకులు శ్రీరంగాచార్య ప్రసంగించారు. రామరాజు కుటుంబ సభ్యులు రఘునారాయణరాజు, యాదవరాజు, ప్రతాప్‌రాజు, అనిల్‌కుమార్, ఆదిత్య, రుక్మిణి, డాక్టర్ భట్టు లక్ష్మీనారాయణ రాజు, డాక్టర్ రుద్రవరం సుధాకర్, రత్నశ్రీ, మహతికీర్తన, మధుకర్, దినకర్, అఖిల, కాంచనపల్లి రాజారాజు, హరికేసరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంఘాల సమన్వయకర్తగా శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సన్మానించిన బ్రాహ్మణ సంఘం నాయకులు

ఆర్కేపురం, ఏప్రిల్ 16:హైదరాబాద్ బండ్లగూడలో బుధవారం రాష్ట్రంలోని అన్ని బ్రాహ్మణ సంఘాల సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దశాబ్ద కాలంగా దేశవ్యాప్తంగా సంఘ సేవ, సామాజిక సేవలందిస్తున్న శ్రీ బసవరాజు శ్రీనివాస్‌ని.. అన్ని బ్రాహ్మణ సంఘాల సమన్వయ కర్తగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్రాహ్మణుల తరపున, సంఘాల తరపున ప్రభుత్వంతో ,సమాజంలో బ్రాహ్మణులపై జరుగుతున్న దాడుల పరిరక్షణకు ఈ సమన్వయ కమిటీ ద్వారా ముందుకు వెళ్తామని బసవ రాజు శ్రీనివాస్ తెలిపారు. అన్ని సంఘాల వారు, వారి వారి కార్యక్రమాలు చేసుకుంటూ, బ్రాహ్మణుల సమస్యలు, హక్కుల కోసం చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు. కార్యక్రమంలో మంగపతిరావు, దర్శనం శర్మ, ప్రమోద్ కొఠారి, మునిపల్లె శ్రీనివాస్, వెన్నంపల్లి జగన్ మోహన్ శర్మ, మోత్కూరు రాము, జోషి గోపాల్ శర్మ, నందిరాజు లక్ష్మీనారాయణ, వైష్ణవి ప్రసాద్, గోపి కృష్ణమాచార్యులు, వక్కలంక శ్రీనివాస్, ఎస్ టి చారి, కృష్ణమోహన్, దేశాయ్, ఉప్పల బాలసుబ్రమణ్యం, వనం కృష్ణవేణి, నరేంద్ర చారి, బండారు రాంప్రసాద్ రావు, రాఘవరావు, ఎంవీ శాస్త్రి, రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

## బీసీల మహాధర్నాకు తరలిరావాలి

### బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్ గౌడ్

మాట్లాడుతున్న నరేందర్ గౌడ్

హిమాయత్ నగర్, ఏప్రిల్ 16: రాష్ట్రంలోని బీసీలకు.. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీసీల మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ తెలిపారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఆ సంఘం కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశ సంపద సృష్టించే ప్రధాన వర్గాల వారికి దానిని అనుభవించే హక్కు దక్కడంలేదన్నారు.పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు ఆమోదం తెలిపాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ రాజ్యసభ సభ్యుడు వీ హనుమంతరావుతో పాటు పలు రాజకీయ పార్టీల నేతలు, బీసీ సంఘాల నేతల హాజరవుతారని తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు శ్రీహరిగౌడ్, రాష్ట్ర కార్యదర్శి భిక్షపతిగౌడ్, అధికార ప్రతినిధి శివ కుమార్ పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ కిట్స్ ఇంకా అందలే

### యువతకు క్రీడా సామగ్రి పంపిణీలో బల్దియా క్రీడావిభాగం అలసత్వం

### అధికారుల తీరుపై మండిపడుతున్న కార్పొరేటర్లు

సిటీబ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ ): చిన్నారులతో పాటు యువతలో క్రీడా నైపుణ్యతను పెంపొందించడంపై జీహెచ్ఎంసీ నిర్లక్ష్యపు ధోరణిని అవలంభిస్తోంది. వేసవి కంటే ముందే ప్రతి డివిజన్‌కు రూ. 2 లక్షల క్రీడా సామగ్రికి సంబంధిత కార్పొరేటర్లకు అందజేయాలని ఐదు నెలల క్రితం జీహెచ్ఎంసీ నిర్ణయించింది. మేయర్ అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో రూ. మూడు కోట్లతో క్రికెట్, షటిల్, బ్యాట్మింటన్, క్యారమ్, చెస్, బాస్కెట్ బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, స్కేటింగ్, టెన్నీస్, టెబుల్ టెన్నీస్ తదితర క్రీడా సామగ్రిని సంబంధిత కార్పొరేటర్లను అందజేయాలని నిర్ణయించారు. 150 డివిజన్లకు గానూ రూ. రెండు లక్షల చొప్పున క్రీడా సామగ్రి పంపిణీకి ఏజెన్సీని ఖరారు చేసిన స్పోర్ట్స్ విభాగం అధికారులు తదనంతరం క్రీడా కిట్ల పంపిణీలో మాత్రం జాప్యం చేశారు. తాజాగా హైదరాబాద్ లోకల్ బాడీ ఎన్నికల కోడ్ రావడంతో ఈ పంపిణీ ప్రక్రియ నిలిపివేశారు. ఈ నెల 26 తర్వాతనే ఆయా కార్పొరేటర్లకు క్రీడా సామగ్రిని అందజేస్తామని స్పోర్ట్స్ విభాగం అధికారులు తెలిపారు.

## 311 సహకార సంఘాలకు ఎఫ్‌పీవోల గుర్తింపు

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 16 : రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ఉన్న 311 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలు(ఎఫ్‌పీవో)గా గుర్తించినట్టు సహకార సంఘాల కమిషనర్ సురేంద్ర మోహన్ అన్నారు. ఎఫ్‌వోల నిర్వహణపై కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 9 సంఘాలను, రంగారెడ్డి జిల్లాలో 14 సంఘాలను, వికారాబాద్‌లో 13 సంఘాలను ప్రాథమికంగా ఎఫ్‌పీవోల గుర్తించినట్టు తెలిపారు. సంఘాల నిర్వహణ, ఆర్థిక పరమైన విషయాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, కోపరేటివ్ యూనియన్ ఎండీ శ్రీమతి అన్నపూర్ణ , మాజీ హార్టికల్చర్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, హార్టికల్చర్ అధికారి చక్రపాణి, సహజ వ్యవసాయ రైతుకు చెందిన ప్రసాద్ రెడ్డి, జిల్లా సహకార అధికారులు వెంకట్ రెడ్డి, సుధాకర్ కే నాగార్జున, తెలంగాణ కోపరేటివ్ యూనియన్ ప్రిన్సిపల్ వెంకన్న, తెలంగాణ కోపరేటివ్ యూనియన్ ఫ్యాకల్టీ ఎస్ ధాత్రిదేవి, సంగీత, సురేఖ రాణి, అనిత, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని సహకార సంఘాల అధికారులు, 36 సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ట్రెండింగ్ సెలూన్స్

- అలంకరణపై పెరుగుతున్న నగరవాసుల ఆశక్తి
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నయా సెలూన్స్, పార్లర్స్
- రంగు ఎలా ఉన్నా సెలబ్రెటీ లుక్ సొంతం
- వీకెండ్‌కు పార్లర్స్‌కు పరుగు పెడుతున్న సిటిజన్లు

సిటీబ్యూరో, ఏప్రిల్ 16 ( నమస్తే తెలంగాణ ) : అందంగా కనిపించడం కోసం ఎంత డబ్బైన ఖర్చు పెట్టడానికి నగరవాసులు వెనకాడటం లేదు. సోషల్ మీడియా వేదికగా సినిమా, సిరీస్‌లు, షార్ట్‌ఫిల్మ్‌లు, యాంకర్లు తదితర రంగాల్లోనూ అవకాశాలు దక్కుతుండటంతో ప్రత్యేక లుక్ కోసం పాకులాడుతున్నారు. ఈ ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని సెలూన్స్ సైతం సౌందర్య సంరక్షణకు అంతర్జాతీయ ప్రమాణాలు జోడిస్తున్నాయి. రంగు ఏదైనా సెలబ్రెటీలుగా తీర్చిదిద్దడానికి విభిన్న రకాల సేవలను అందుబాటులో ఉంచారు. ఇదే క్రమంలో గ్రేటర్‌లో విస్తృతంగా ట్రెండింగ్ సెలూన్స్ వెలుస్తున్నాయి. గ్రేటర్ పరిధిలో ప్రతీ వీకెండ్‌కు ఫ్యామిలీ అంతా సెలూన్‌కు వెళ్లి సౌందర్యానికి మెరుగులు దిద్దుకుంటున్నారు. ఇతరులకు ఆకర్షణీయంగా కనిపించేందుకు తహతహలాడుతున్నారు. అలంకరణ మీద ఒక కుటుంబం(నలుగురు సభ్యులు) సుమారుగా నెలకు రూ.20వేల వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా హెయిర్ కేర్, స్కిన్, బాడీ కేర్, హెయిర్ కలరింగ్, గ్రూమింగ్, స్పా, హెయిర్ స్పా, నెయిల్ ఆర్ట్, హెయిర్ స్టైలింగ్, మానిక్యుర్, మేకప్, డెటన్, పెడిక్యూర్, మెనిక్యూర్,ప్రీమియం ఫేషియల్స్, ఫేషియల్స్, క్లిన్‌అప్స్, హెయిర్ ఫార్మ్స్, వెల్ హెయిర్ స్పా తదితర సేవలకు భారీగా డిమాండ్ ఏర్పడింది.

**అత్యాధునికంగా..!!**

ఇంటర్నేషనల్ జ్యూసీ సెలూన్, హబీబ్ లాంటి సెలూన్ బ్రాంచీలు నగరంలో మరిన్ని ప్రారంభమయ్యాయి. వీటి సరసన ఇంకొన్ని అత్యాధునిక సెలూన్స్ ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఏసీ గదులు, ఇంటీరియర్ డిజైన్స్, పూల మొక్కలు, విశాలమైన గదులు ఇలా అన్ని రకాలుగా ఆకట్టుకునేల సెలూన్స్‌ను తీర్చిదిద్దుతున్నారు. వెయిటింగ్ కస్టమర్లకు బోర్ కలగకుండా మ్యాగ్జిన్స్, టీవీ, పజిల్స్ లాంటి సేవలను అందిస్తున్నారు. కుటుంబ సమేతంగా వెళ్లి ఆహ్లాదంగా సెలూన్ సేవలను పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని చోట్ల ధరలు కూడా మెనూలో పొందుపర్చి సేవలను అందిస్తున్నారు. హెయిర్ కలరింగ్‌లో అమోనియా ఫ్రీకి రూ.1000, ఫ్యాషన్ కలర్‌కు రూ. 1200, క్రిస్టల్ పెడిక్యూర్‌కు రూ.1000, హీల్ పీల్‌కు రూ.1500 ఉన్నాయి. అయితే ఫేషియల్స్‌లో మాత్రం ధరలు అధికంగా ఉన్నాయి. రేడియంట్ ఫేషియల్‌కు రూ.3,500, గ్లోకు రూ.3,500, ఆక్సిజన్ ఫేషియల్‌కు రూ.4,500, టెక్నికల్ సర్వీసెస్‌లో స్రెయిటనింగ్ ధరలు రూ.3 వేల నుంచి రూ.12వేల వరకు తీసుకుంటున్నారు.

**సోషల్ మీడియా వేదికగా..**

నగరంలోని మెజార్టీ ప్రజలు, ఇన్‌ఫ్లూయెన్సర్లు తమ సౌందర్యాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రదర్శిస్తున్నారు. అందంగా తయారై ఫొటోలు దిగి ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్, ఇన్‌స్టాలో షేర్ చేయడమనే ఆసక్తి విరివిగా పెరిగింది. ఒక్కో ఫొటోలో ఒక్కో లుక్ ఉండేలా అలంకరణపై దృష్టి పెడుతున్నారు. లైక్స్, కామెంట్స్ వచ్చేలా ట్రెండీ లుక్స్‌ను ఆశ్రయిస్తున్నారు. అలాగే బ్యూటీ ప్రొడక్ట్స్‌ను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసే వారి సంఖ్య పెరిగింది. సినిమాల్లో హీరోలను అనుసరిస్తూ గ్రూమింగ్ ఫాలో అవుతున్న వారూ ఉన్నారు. ఆత్మవిశ్వాసంగా కనిపించడంలోనూ అలంకరణ ప్రధాన పాత్ర పోషిస్తోంది.

## కెరీర్‌లోనూ అలంకరణ కీలకమైంది

ఇది వరకు చాలా కంపెనీలు పనిలో నైపుణ్యం, ప్రతిభను పరిగణలోకి తీసుకునేవి. మారిన పరిస్థితుల్లో ఎన్నో రంగాల్లో ఉద్యోగాలు వచ్చాయి. ప్రస్తుతం నైపుణ్యం, ప్రతిభతో పాటు అందంగా కనిపించడం కూడా పరిగణలోకి తీసుకుంటున్నారు. వినియోగదారులతో నేరుగా సంబంధాలు ఉండే కొలువుల్లో చక్కగా సిద్ధం కావడం, రోజంతా హుషారుగా ఉండటం అదనపు అర్హతగా భావిస్తున్నారు. ఇప్పుడు అలంకరణ అనేది జీవితంలో ఒక భాగమైపోయింది.

*– శ్రావ్యరెడ్డి, ఫౌండర్, ఇంటర్నేషనల్ జ్యూసి సెలూన్ సెంటర్*

## పురుషుల్లోనూ శ్రద్ధ పెరిగింది

ఈరోజు అలంకరణ అనేది అమ్మాయిలకే పరిమితం కాలేదు. మహిళలతో సమానంగా ట్రెండీ స్టైల్‌గా కనిపించేందుకు పురుషులు కూడా ఇష్టపడుతున్నారు. రోజువారీ, పండుగలు, వేడుకల్లోనూ ఆ మార్పు ఇటీవల కాలంలో ప్రతిబింబిస్తోంది. కుర్రకారుతో పోటీ పడేందుకు యువకులుగా కనపించేందుకు 40ఏండ్లు పైబడిన వారు కూడా అధిక ఆసక్తి చూపిస్తున్నారు.

*– సునీత, బ్యూటీషియన్*

## సంపన్నుల ఆస్తులను జాతీయం చేయాలి

### ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి లెనిన్ బాబు

మాట్లాడుతున్న లెనిన్ బాబు

హిమాయత్ నగర్, ఏప్రిల్ 16: దేశంలోని వనరులను అక్రమంగా దోచుకుంటున్న కొంతమంది సంపన్నుల ఆస్తులను జాతీయం చేయాలని ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి లెనిన్ బాబు, రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లాఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్ లో రాష్ట్ర కన్వెన్షన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడా వ్యాపారవేత్తలు దేశాన్ని అన్ని రకాలుగా దోచుకుని వారి ఆర్థిక స్థితి గతులను మెరుగుపరుచుకుంటూన్నారే తప్ప దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో మాత్రం వారి పాత్ర శూన్యమన్నారు. దేశంలో రోజు రోజుకు నిరుద్యగ సమస్యల జఠిలమవుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. యువతను మోసం చేస్తున్న ప్రభుత్వాల మెడలు వంచేందుకు బలమైన ఉద్యమాలు చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, నేతలు వెంకటేశ్వర్, లింగం, రవి, శ్రీనివాస్, యుగంధర్, మహేందర్, ఆర్. బాలకృష్ణ, సల్మాన్ బేగ్, మహమూద్, శివ కుమార్, సుధీర్, లక్ష్మణ్,మహేష్, మాజీద్ అలీఖాన్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# స్లాట్ బుకింగ్‌ను రద్దు చేయాలి

మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖరులు

**దస్తావేజు లేఖరుల ఆందోళన**

మేడ్చల్, ఏప్రిల్ 16 : స్లాట్ బుక్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం దస్తావేజు లేఖరులు ఆందోళన బాట పట్టారు. మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

**ఘట్‌కేసర్ సబ్‌రిజిస్టర్ కార్యాలయం ఎదుట..**

ఘట్‌కేసర్, ఏప్రిల్ 16: స్లాట్ బుకింగ్వి విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ బుధవారం ఘట్‌కేసర్ సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు ఆందోళనకు దిగారు. టీడీడబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు నరేశ్ గౌడ్, రాజేష్, శ్రీకాంత్ గౌడ్, సుధాకర్, లక్ష్మణ్ చారి, బక్రష్ణ కుమార్, మహేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**కీసర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట..**

కీసర, ఏప్రిల్ 16: స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దుచేయాలని కోరుతూ డాక్యుమెంట్ రైటర్స్ కీసర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట బుధవారం పెద్ద ఎత్తునధర్నాకు దిగారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్‌కు వినతపం అందజేశారు.

**నారపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో..**

పోచారం,ఏప్రిల్16: రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ పద్ధతిని ప్రభుత్వం విరమించుకోవాలంటూపోచారం మున్సిపాలిటీ నారపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్స్ రెండవ రోజు ఆందోళన చేపట్టారు. అధ్యక్షుడు శ్రీనివాస్ కుమార్,ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ గౌడ్,నారపల్లి దస్తావేజు లేఖరులు శ్రీనివాస్,నరేందర్ గౌడ్, బాలకృష్ణ, హరికృష్ణ, మధుసుదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజిగిరిలో..**

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 16:రిజిస్ట్రేషన్‌లో స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలని మల్కాజిగిరి డాక్యుమెంట్ రైటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. మల్కాజిగిరి డాక్యుమెంటరీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మణ్ , ప్రధాన కార్యదర్శి చేకొండ నరేష్‌బాబు, ఫరూక్, సూర్యకుమారి, ప్రభాకర్, హిమజ, జ్యోతి, శంకర్, రూప, సుధీర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవీ రమణ, తెలంగాణ గౌడ కల్లుగీత వృత్తిదారుల సమన్వయ కమిటీ చైర్మన్ బాలరాజు గౌడ్, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవికుమార్ గౌడ్

## గీత కార్మికుల సంఘ బహిష్కరణ హేయమైన చర్య

### రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 16 : నిజామాబాద్ జిల్లా ఎర్గట్ట మండలం తాళ్ల రాంపూర్ గ్రామంలో గీత కార్మికులపై విధించిన సాంఘిక బహిష్కరణను వెంటనే ఎత్తివేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవీ రమణ, తెలంగాణ గౌడ కల్లుగీత వృత్తి దారుల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజు గౌడ్, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ యేలికట్టే విజయకుమార్ గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో చట్ట విరుద్ధంగా ఏర్పాటైన విడిసీల (విలేజ్ డెవలప్మెంట్ కమిటీ)ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గౌడ మహిళను గుడి నుంచి గెంటివేసి ఈత చెట్లను తగలబెట్టిన విడిసీ సభ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. గత ఆరు నెలలుగా కల్లుగీత కార్మికులను.. సాంఘీక బహిష్కరణ చేయటం అత్యంత దారుణమని.. దీనిని కోర్టు సమోటోగా తీసుకొని నిందుతులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విడిసీల ముసుగులో అరాచకాలకు పాల్పడుతూ దళిత బహుజనులను హింసకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విలేజ్ డెవలప్మెంట్ కమిటీల అరాచకాలను ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆరికట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు వెంటనే ఆ గ్రామాన్ని సందర్శించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ నెల 25న గీత కార్మికులకు మద్దతుగా వేలాది మందితో ఛలో తాళ్ల రాంపూర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత సంఘం ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, వివిధ సంఘాల నాయకులు పి.అశయ్య ఎల్.బాలకృష్ణ, ఉడుత రవీందర్, ఎం.దశరతదితరులు పాల్గొన్నారు.

# సుప్రీం తీర్పు సర్కార్‌కు చెంపపెట్టు

- కంచ గచ్చిబౌలి భూముల విధ్వంసాన్ని తప్పుపట్టిన దేశ అత్యున్నత న్యాయస్థానం
- హర్షం వ్యక్తం చేసిన హెచ్‌సీయూ విద్యార్థులు
- ప్రభుత్వం ఇకనైనా తీరు మార్చుకోవాలని హితవు

నిరసన తెలుపుతున్న హెచ్‌సీయూ విద్యార్థులు (ఫైల్)

సిటీ బ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ పరిధిలోని 400 ఎకరాల్లో కాంగ్రెస్ సర్కార్ చేసిన విధ్వంసాన్ని సుప్రీం కోర్టు తీవ్రంగా తప్పు పట్టడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. హెచ్‌సీయూ భూముల్లో పర్యావరణం, జీవవైవిధ్యం పరిరక్షణకు తాము చేస్తున్న ఉద్యమం ఫలితాన్నిచ్చిందని అన్నారు. ప్రభుత్వం ఇకనైనా పర్యావరణ విధ్వంసాన్ని మానుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంస్థలు, జీవవైవిధ్యాన్ని సంరక్షించాల్సిన ప్రభుత్వం వాటిని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తే ఇలాంటి పరాభవమే ఎదురవుతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. అధికారం ఉందని నిబంధనలకు విరుద్ధంగా పాలన సాగిస్తామంటే న్యాయ వ్యవస్థ చూస్తూ ఊరుకోదని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పేరుతో సుదీర్ఘకాలంగా వస్తున్న సంపదను కొల్లగొట్టాలనుకోవడం సిగ్గు చేటని మండిపడ్డారు. ఇప్పటికైనా సుప్రీం కోర్టు సూచించినట్లు చెట్లను తెగనరికిన ప్రాంతంలో పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్‌కు గ్రీన్ లంగ్ స్పేస్‌గా ఉన్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను పరిరక్షించాలని కోరారు. హెచ్‌సీయూ ప్రాంతాన్ని గ్రీన్ జోన్‌గా ప్రకటించి, సంరక్షించాలని అన్నారు.

### పునరుద్ధరణ పనులు చేపట్టాలి

కంచ గచ్చిబౌలి అటవీ భూముల విషయంలో సుప్రీం కోర్టు విచారణ తీరుపై సంతోషం వ్యక్తం చేస్తున్నా. గతేడాది హెచ్‌సీయూలో వనమహోత్సవం పేరుతో వందల ఎకరాల్లో చెట్లను నరికేసి అశాస్త్రీయ మొక్కలను (అటవీ చెట్లు కానివి, జంతు ఆవాసానికి, ఆహారానికి ఉపయోగపడనివి) నాటారు. అయితే సుప్రీం కోర్టు చెప్పినట్లు అటవీ పునరుద్ధరణ విషయంలో ప్రభుత్వంపై మాకు నమ్మకం లేదు. పర్యావరణవేత్తల సలహాలు, సూచనలతో పునరుద్ధరణ పనులు చేపట్టాలి. అడ్మినిస్ట్రేషన్ విభాగం సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలి.

*– ప్రవీణ్ కుమార్ సాకే, రిసెర్చ్ స్కాలర్, బయోడైవర్సిటీ క్లబ్ ఫౌండర్, హెచ్‌సీయూ*

### అసత్య ప్రచారాలను మానుకోవాలి

కాంగ్రెస్ సర్కార్‌కు సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నాం. సుప్రీం విచారణ తీరు రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటింది. 400 ఎకరాల్లో జింకలు, నెమళ్లు, అటవీ మొక్కలు లేవని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను ఇప్పటికైనా మానుకోవాలి. హైకోర్టు రిజిస్ట్రార్, సీఈసీ ఇచ్చిన నివేదికల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చట్టాలను ఏవిధంగా ఉల్లంఘిస్తున్నదో తేటతెల్లమైంది. ఇప్పటికైనా 1975లో హెచ్‌సీయూకు కేటాయించిన భూములన్నీ రిజిస్ట్రేషన్ చేయించాలి. న్యాయబద్ధంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను కొట్టేయాలి.

*– తుంగ రమేశ్, డీఎస్‌యూ ప్రెసిడెంట్,హెచ్‌సీయూ*

### మా పోరాటానికి తొలి విజయం

హెచ్‌సీయూ భూముల విచారణలో సుప్రీం కోర్టు కాం